తెలుగు కళా సమితి మ్యాజెర్సీ ప్రజాపతి ఉగాది కథల పోటీలో రూ. 300/-లు గెలుపొందిన కథ

# ఎందుకంటే...



- జి. భవానీరమణ

నరేంద్ర గాడి ఇరవై నాలుగో పెళ్ళి చూపుల కార్యక్రమం పూర్తి చేసి కాలుబయట పెట్టాక వెంట వెళ్ళిన నేను అడిగాను. "అమ్మాయి బాగానే వున్నట్లుంది బహుశా నీకు నచ్చుతుందనుకుంటాను"

ఆ మాటకి అది ఏం భావమో అర్థం కాకుండా మొహం పెట్టి, "అంతా బాగానే వుంది కానీ ఆ కళ్ళజోడుంది చూశావ్, అది బాగ లేదు" అన్నాడు. అఫ్షే ఈ సంబంధం కూడా ఇంతే సంగతులని వేరే చెప్పనవసరం లేదు. అసలీ వేట ప్రారంభం కాకముందే అడిగాను, 'ఏకెలాంటి అమ్మాయి కావాలని.

"ఉద్యోగం చేసే అమ్మాయి అయితే చాలు, ఈ రోజుల్లో ఒక్కడి జీతం మీద బతకడం ఎంత కష్టమో నీకు చెప్పనవసరం లేదు గదా" అన్నాడు. నిజమే అనుకుని ఓ ఉద్యోగం చేసే అమ్మాయిని (సంబంధం) చూపించాను. తీరా చూశాక అమ్మాయి అందంగా లేదన్నాడు. అంటే ఉద్యోగం చేస్తూ అందంగా (తన దృష్టిలో) వున్న అమ్మాయి కావాలన్నమాట! మరీ మొదటి సంబంధమే ఎలా కుదురుతుందిలే అని అటువంటిదే ఇంకో సంబంధం ఎవరో చెప్తే అదే వాడి చెవిన వేశాను. మళ్ళీ పెళ్ళి చూపుల ప్రహసనం పూర్తయ్యాక, "అమ్మాయిని గవర్నమెంట్ ఉద్యోగం కాకపోయినప్పుడు మనకెందుకూ" అన్నాడు.

...అంటే గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్న అందమైన అమ్మాయి కావాలన్నమాట. ...అలా... అలా ఇప్పటికి ఇరవై మూడు సంబంధాలూ చూస్తూ వస్తున్న నరేంద్రగాడికి తనకి కావలసింది వాళ్ళ దగ్గర ఏం మిస్సవుతోందో బయటపడ్తూ వెరసి ఉద్యోగం చేసే అమ్మాయయితే చాలునన్నవాడికి ఇప్పుడు..1. ఉద్యోగం (గవర్నమెంటు, పర్మనెంట్ అయిన) చేస్తూ 2. చాలా అందమయినదీ 3. చాలా చిన్న కుటుంబంలోనుంచి వచ్చినదీ 4. కాబోయే మామగారు చిన్నా చితకా ఉద్యోగం చేసే వారు కాకుండ వీలయితే ఎగ్జిక్యూటివ్ కేడర్‌కి తక్కువ కాని వారు మాత్రమే అయి వుండీ 5. తోడల్లుళ్ళూ, బావమరుదులూ కూడా ఉన్నతస్థాయిలో వున్న వారయి వుండీ 6. ఇంకా... 7. ఇంకా... 21. జాతకాలు కలిసీ 22. కట్న కానుకలు ఇవ్వకపోయినా లాంఛన ప్రాయంగా కనీసం కలర్ టీవీ గానీ, ఫ్రిజ్ గానీ మరి అలాంటిది ఏదో ఒకటైనా ఇచ్చి 23. పెళ్ళి ఘనంగా జరిపించగలిగి వుండాలి... ఇవన్నీ కాక ఇప్పుడు 24వది అమ్మాయి జోడు (వస్తుతానికి కళ్ళకు మాత్రమే) వాడనిదై వుండాలి. మళ్ళీ ఇంకో సంబంధం చూస్తే గానీ ఇవన్నీ కాక ఆ అమ్మాయికి ఇంకేదైనా వుండాలేమో తెలియదు!

నేను చెప్పేదంతా వింటూ నరేంద్రగాడు యే ఐ.ఎ.ఎస్సో, ఐ.పి.ఎస్సో అని మీకు అనుమానం వస్తే మీరు పప్పులో కాలేసినట్లే. శాఖోపశాఖలుగా విస్తరించిన అనేకానేక ప్రభుత్వ ఆఫీసుల్లో ఒకానొకదాంట్లో వాడు 'క్లర్కు' మాత్రమే. అయితేనేం, తనబోటి వాణ్ణి చేసుకోవాలంటే అమ్మాయి ఎంత అదృష్టవంతురాలయి వుండాలి? ఇది వాడి అభిప్రాయమే, నాది కాదు.

"అయితే ఇంకో సంబంధం చూడాల్సిందేనంటావ్?" సాలోచనగా వాడి మొహంలోకి చూస్తూ అన్నాను నేను. "నీ అందానికీ, హోదాకీ సరిపడేలా వీళ్ళల్లో ఒక అమ్మాయిని ఎంచుకుని సరిపెట్టుకోలేవా?"

"అవకాశం వున్నప్పుడు సరిపెట్టుకోవలసిన ఖర్మ నాకేమిటి? ఈ అమ్మాయి కాకపోతే మరో అమ్మాయి" అన్నాడు వాడు.

ఈ సరిపెట్టుకోకపోవడమన్నది 'అవకాశం' వుండడం వల్ల అన్న విషయం నాకప్పుడు గానీ అర్థం కాలేదు. ఈ అవకాశమనేదే లేకపోతే?... సమాజంలో ఈ అవకాశం ప్రస్తుతం మగాడికే ఇస్తున్నాం కదా, అదే ఆడదానికి ఇస్తే? బహుశా ఈ కథ పుంలింగ ప్రధానంగా కాక స్త్రీలింగ ప్రధానంగా నడిచేదేమో తప్ప వేరే మార్పేమీ వుండేది కాదనుకుంటా! మనస్తత్వానికి సంబంధించినంతవరకూ ఆడైనా మగైనా మనిషే కదా!!

మొత్తం మీద తర్వాత అయిదు సంవత్సరాల కాలం వరకూ కూడా నరేంద్రగాడు సంబంధాలు చూస్తూ సెంచరీ పూర్తి చేశాడు. ఈలోగా నేను పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లల తండ్రిని కూడా అయ్యాను. చివరికి ఎవరిదో సలహా మీద పేపరు ప్రకటన ఇచ్చాడు 'వధువు కావలెను' అని. ఆ రోజు వాళ్ళింటికి వెళ్తే వచ్చిన అప్లికేషన్లని నా ముందు పడేశాడు చూడమని. వాడి పెళ్ళి విషయం నాకు తలనొప్పిపోయి కోపం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఎంత ప్రాణ స్నేహితుడైనా వాడి ఆలోచన సమంజసంగా లేనప్పుడు సమర్థించడం తప్పు అనుకుని, వాటిని కనీసం చేతిలోకైనా తీసుకోకుండా చిరాకుగా అన్నాను, "బహుశా అన్ని పెళ్ళి చూపులూ పూర్తయి ఎవ ఎవరికీ నచ్చక ఇక పెళ్ళే కాదని ఆఖరి అవకాశంగా ఇలా అప్లై చేసుంటారు వీళ్ళంతా. నీకు అటువంటి వాళ్ళే కావాలనుకుంటే చూసి చెప్తాను."

ఈ విషయాన్ని నేను చెప్పిన కోణం నుండి చూడకపోవడం చేత నా మాటలకి విస్తుపోయినట్లుయి, తెరుకున్నాక ఆ అప్లికేషన్లన్నీ పక్కకి నెట్టేసి, "మరేం చెయ్యమంటావు" అన్నాడు దీనంగా.

గోర్కీ పాత్ర... 28వ పేజీ తరువాయి

ఈ ఆపరేషనుకు బ్లడ్ ఎంత అవసరమో నాకు తెలుసు. వాది బి.పాజిటివ్ కదా..." సరళ నవ్వుతూ చెబుతున్నా నా కళ్ళలో నీళ్ళు. ఎంత త్యాగం! గోర్కీ కథ చదివినప్పుడు ఆ కథలోని పాత్రల మంచితనం, త్యాగనిరతి నన్ను విస్మయ పరిచాయి. అలాంటి వ్యక్తులు కొద్దిమందైనా మన మధ్య వుండబట్టే ఇంత కుళ్ళు, ఇంత దుర్మార్గం, ఇంత మోసం వున్న ఈ ప్రపంచంలో మనం ఈ మాత్రంగానైనా బ్రతక గలుగుతున్నామని పించింది. సరళ సజీవంగా మన మధ్య జీవిస్తున్న గోర్కీ పాత్ర. ●

(రిత్విక్‌కి పుట్టిన రోజు కానుకగా)

"నగటు మనిషి జీవితం అరవై అయిదు సంవత్సరాలనుకుంటే నీకింకా మూడు దశాబ్దాల జీవితం మాత్రమే వుంది. నీకు నచ్చిన అమ్మాయి కావాలనే ఆరాటంలో అప్పుడే ముప్పై అయిదు సంవత్సరాల జీవితం అయిపోయింది. ఇన్ని కోరికలతో జీవిస్తే మరో నాలుగైదు సంవత్సరాల్లో షుగర్, బ్లడ్ ప్రెజర్ లాంటి రోగాలు కూడా వస్తాయి. ఇక అప్పుడు జీవించడం కూడా వృథాయే! అందుచేత ఇప్పటికైనా తొందరపడడం మేలు. లేదంటే నీ జన్మకిక పెళ్ళే జరక్కపోవచ్చు" అన్నాను తాత్వికంగా.

"అయితే" తత్వం బోధపడి తన్మయావస్థలోకి వెళ్ళి అన్నాడు, "ఈసారి చూడబోయే సంబంధం ఎలా వున్నా ఓకే మిత్రమా"

తర్వాతి సంబంధం చూశాక అమ్మాయి పాతిక సంవత్సరాల మీద మరీ అయిదు సంవత్సరాలు పెద్దదనే కారణం మీద మానేయాలనుకున్నాడు. వాడి వయసు గుర్తు చేసేసరికి 'ఈడు' జోడుగానే తోచి మొత్తం మీద 'సరే' అన్నాడు. దాంతో వాడి పెళ్ళి సరళతో ఘనంగానే జరిగింది. అయితే పెళ్ళి జరిగిన నాలుగు నెలలకే ఈ కథ గమ్మత్తయిన మలుపు తిరిగింది.

ఆడదాన్ని షోకేసులో బొమ్మలా మాత్రమే చూసిన నరేంద్రకి ఇప్పుడు ఆడవాళ్ళ మనస్తత్వమేమిటో మెల్లిగా బోధపడ సాగింది-

మనస్పర్థలు రావడానికి ఎంతోకాలం పట్టలేదు. స్పర్థలకి ముఖ్య కారణాలను లిస్టు రాస్తే-

1. నరేంద్ర తల్లికి వున్న చాదస్తం సరళకి నచ్చలేదు.

2. తన జీతంలోంచి పైసా కూడా నరేంద్ర కివ్వడానికి సరళకి ఇష్టం లేదు.

3. భారతీయ కళల పట్ల ఆసక్తి చూపని సరళ పాప్ మ్యూజిక్, ఆంగ్ల సాహిత్యమూ అంటే ప్రాణాలిచ్చేస్తుంది. అవంటేనే నరేంద్రకు అసహ్యం... ఇంకా ఇంకా ఈ కథ పరిధిని మించిన కారణాలు చాలా వున్నాయి.

సరళ మొట్టమొదటిసారి ఎదురు చెప్పినప్పుడు తెలిసింది నరేంద్రకి, భార్య అనే ఆడది మొగుడికి ఎదురు చెప్పగలదూ అని. ఆ ఉమ్ములో బ్రతికేకన్నా నరేంద్ర అవసరం లేకుండా తనొక్కతే ధైర్యంగా, అంతకన్నా స్వేచ్ఛగా బ్రతకగలనని సరళ అన్నప్పుడు నరేంద్రకి నరాలన్నీ తెగిపోయినట్లనిపించింది. భార్య ఆలోచనల్నీ, అభిరుచుల్నీ ఆదరించలేనప్పుడు అవతలి మనిషి ఎదురు తిరిగితే ఏ స్థాయిలో వుంటుందో కొంచెం కొంచెం బోధపడింది. పైగా ఆవిడ ఉద్యోగం చేసేది కూడా అయితే స్వేచ్ఛను ఏ మూల్యానికి రాజీపడి వదులుకోగలదు? ఇద్దరూ వాగ్యుద్ధానికి దిగి విడిపోవడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. సరళ పరుగెత్తుకుంటూ పుట్టింటికి వెళ్ళి పోయింది- తాత్కాలికంగా!

అక్కడే తెలిసింది మరో ఆరు నెలల్లో తను తల్లిని కాబోతున్నానని.

'అతి ఖరీదయిన మేలు జాతి వజ్రాన్ని ఎంతో కష్టపడి జాగ్రత్తగా ఎన్నుకుని కొనుక్కున్నట్లూ వందకుపైగా అమ్మాయిల్లోంచి ఎన్నుకుని పెళ్ళి చేసుకుంటే ఏమిటి ఇలా జరిగింది! ఇంకెవరిని చేసుకున్నా బహుశా నా పరిస్థితి ఇలా వుండేది కాదేమో... ఛ ఎంత తప్పు చేశాను' అని నరేంద్ర మధనపడు తుండగా వెళ్ళాను నేను.

"ఇంకొకరి అభిప్రాయంతో రాజీపడలేక పోయినప్పుడు ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి మధ్యా ఏకాభిప్రాయం సాధ్యపడదు. ఇద్దరి లోనూ రాజీపడే గుణం లేనప్పుడు సరళ బదులు విమలో, కమలో మరో ఎక్స్ వై జెడ్ ఎవరైనా ఈ పరిస్థితి తప్పదు. పెళ్ళి కోసం అమ్మాయిని ఎన్నుకోవడమంటే వంద మందిని చూసి వాళ్ళల్లో లోపాలెత్తి చూపి బాధ పెట్టడం కాదు. మన తల్లిలోనూ, తండ్రి లోనూ, తోడబుట్టిన వాళ్ళల్లో కూడా లోపా లుంటాయి. మన తల్లి ఇలా వుండాలి, తండ్రి ఇలా వుండాలి అని వాళ్ళని ఎన్నుకునే అవకాశం మనకి లేదు. వాళ్ళు ఎలా వున్నా ఎలాంటి వాళ్ళైనా పుట్టిన తర్వాత వాళ్ళతోటే సరిపెట్టు కుంటాం. ఎందుకు? వాళ్ళు మనల్ని ప్రేమగా చూస్తున్నారనే నమ్మకంతో, తల్లిదండ్రులుగా వాళ్ళని గౌరవించాలనే భావనతో- ప్రేమ వుంటే సరిపెట్టుకోవడం వుంటుంది. సరిపెట్టు కోవడమే వుంటే ప్రేమ పుడుతుంది! నీ తల్లి చాదస్తమూ, నీ తండ్రి తాగుబోతుతనమూ నీకు నచ్చకపోయినా సహిస్తున్న నువ్వు సరళ విషయంలో ఎందుకు రాజీపడలేక పుట్టింటికి పంపేశావో చెప్పగలవా?... నువ్వు చెప్పలేవు... అదే అహం! దాని నుండి పుట్టిన ప్రేమ రాహిత్యం!!"

దాదాపు అరగంట సేపు ఆపకుండా లెక్చర్ ఇచ్చినా ఎదురు చెప్పకుండా విన్నాడు. తర్వాత ఒక గంట మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలాక, "నువ్వు తండ్రివి కూడా కాబోతున్నావురా నరేంద్రా, పట్టుదలమాని వెళ్ళి సరళను చూసిరా" అన్నాను పరిస్థితిని తేలికపరుస్తూ.

ఏమనుకున్నాడో, 'సరే' అంటూ వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

వచ్చేటప్పుడు బుల్లి పాపతో భార్యాసమేతుడై తిరిగి వచ్చి "అబ్బాయి కావాలనుకుంటే అమ్మాయి పుట్టిందిరా" అన్నాడు బాధగా.

"పిల్లల్ని కనడమంటే పెళ్ళాన్ని ఎన్నుకోవడం కాదురా, మన ఇష్ట ప్రకారం జరగడానికి, ఈ విషయంలోనూ జీవితాంతం సరిపెట్టుకోక తప్పదు మరి, ఇన్ని విషయాలలోనూ మన ఇష్ట ప్రకారం జరగకుండా విధి చేతిలో బొమ్మలయినప్పుడు పెళ్ళి విషయంలో అంత 'ఇది' ఎందుకు?" అన్నాను.

ఏం చెప్పాలో తోచక కాస్సేపాగి, "ఇంత దూరమొచ్చాక ఈ ప్రశ్న అప్రస్తుతమైనప్పటికీ చెప్తాను విను" అని మొదలుపెట్టాడు, "ఎందుకంటే.........

●

## మంత్రాలకి చింతకాయలు రాలవు

నిరాడంబర జీవన విధానం పట్లా, ప్రకృతి ఆరాధన పట్లా మహాత్మా గాంధీకి ఆసక్తి కలిగించి, ఆయనకి ఒక రకంగా మార్గదర్శకునిగా వ్యవహరించి 'థూరో' ధార్మిక జీవనాన్ని గడుపుతూ కర్తవ్య దీక్షని ఎప్పుడూ మరవని ఒక గొప్ప కర్మయోగి!

ఓ మారు ఆయన దగ్గరికి ఓ రాజ్యాధినేత వచ్చి, ఈ లోకంలో కష్టాలూ కన్నీళ్ళూ లేకుండా చేసేమార్గం ఉపదేశించమని అడిగాడు. దానికి 'థూరో' చిరునవ్వు నవ్వి 'నీకో కథ చెప్తాను విను' అన్నాడు.

"ఇలాగే పూర్వం ఒక మంత్రి ఒక దుకాణం దగ్గరికి వెళ్లాడు. అంగట్లో షావుకారు కూర్చునే పీట మీద షావుకారుకి బదులుగా ఒక దేవత కూర్చుని వుంది. "ఇక్కడ ఏం దొరుకుతాయి?" అని అడిగాడు ఆ మంత్రి. 'నువ్వు ఏం కోరుకున్నా, ఏం కావాలన్నా ఇక్కడ దొరుకుతుంది. నీ ఇష్టం వచ్చింది అడుగు" అంది ఆ దేవత.




"అయితే ఈ భూలోకంలో అందరూ శాంతిగా జీవించాలి. ఎవరికీ దుఃఖం బాధ వుండకూడదు. కరువులూ, కాటకాలూ, యుద్ధాలూ, తగాదాలూ, అనారోగ్యాలూ ఏం లేకుండా మనుష్యులంతా సంతోషంగా బ్రతకాలి. అలాంటి శాంతి సంతోషం ఇస్తావా" అని అడిగాడు మంత్రి. దానికి ఆ దేవత చిరునవ్వు నవ్వి"నువ్వు అడిగినవి ఫలాలు. ఫలాలు ఇక్కడ అమ్మం. విత్తనాలు మాత్రమే అమ్ముతాం. ఆ విత్తనాలు పట్టుకెళ్లి నాటి వృక్షాల్ని పెంచి ఫలాన్ని పండించుకోవాలి" అని చెప్పి మాయమైంది." అని చెప్పి కథ ముగిస్తూ "తెలిసిందా మంత్రాలకు చింతకాయలు రాలవు! ఆనందంగా సుఖంగా జీవించాలి అనే కోరిక వున్నంత మాత్రాన సరిపోదు. అందుకు అవసరమైన కృషి కూడా చెయ్యాలి" అని హితబోధ చేశాడు.

—పోలా ప్రగడ